# పందెం కోడికి యమ గిరాకీ

- కోడిని బట్టి లక్షల్లో ధర
- విదేశాలకూ ఎగుమతి అవుతున్న పందెం పుంజులు

గణపవరం: పందెం కోడి పుంజులకు యమ గిరాకీ ఏర్పడింది. ఒకప్పుడు అక్కడక్కడా నిర్వహించే కోడిపందేలు ఇటీవల గ్రామ గ్రామాన దర్శనమిస్తున్నాయి. ముఖ్యంగా సంక్రాంతి పండుగ రోజుల్లో కోడిపందేలు విచ్చలవిడిగా జరుగుతున్నాయి. పెద్దా, చిన్నా, ఆడ, మగ అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరూ కోడిపందేల పట్ల ప్రత్యేక ఆసక్తి చూపుతున్నారు. దీంతో కోడిపందేల వ్యాపారం కోట్లకు చేరింది. దీనితో పందెం కోడి పుంజులకు ఎక్కడా లేని గిరాకీ వచ్చింది. ఒకప్పుడు రాష్ట్రంలోనే కోడి పుంజుల విక్రయాలు, కొనుగోళ్లు జరుగుతుండేవి. కొన్నేళ్లుగా ఇతర రాష్ట్రాల నుంచి, విదేశాల నుంచి కొందరు వచ్చి ఇక్కడి పందెం పుంజులను కొని తీసుకెళ్తున్నారు. థాయిలాండ్, కాంబోడియా తదితర దేశాల నుంచి కొందరు వ్యక్తులు ఇక్కడి పందెం కోడిపుంజులను కొనుగోలు చేస్తున్నారు. దీనితో కోడి పుంజుల పెంపకాన్ని కొందరు ప్రత్యేక వ్యాపకంగాచేసుకుని, లక్షల్లో ఆదాయంపొందుతున్నారు.

**విరివిగా పందెం పుంజుల పెంపక కేంద్రాలు**

ఉంగుటూరు నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లోనూ కోడి పుంజుల పెంపక కేంద్రాలున్నాయి. గణపవరం, నిడమర్రు మండలాల్లో కొందరు యువకులు పందెం కోడి పుంజులను పెంచుతూ ఆదాయం పొందుతున్నారు. సంక్రాంతి పండుగ రోజుల్లో పందేల కోసం ప్రత్యేకంగా పందెం కోడి పుంజులను పెంచే కేంద్రాలుగా జిల్లాలో భీమవరం, పాలకొల్లు, నర్సాపురంతో పాటు మెట్ట ప్రాంతంలో కొన్ని గ్రామాలకు పేరుండేది. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల వారు ఇక్కడకు వచ్చి పందెం పుంజులను కొనుగోలు చేసేవారు. కొన్నేళ్లుగా కోడిపందేల జోరు పెరగడంతో పందెం పుంజుల పెంపక కేంద్రాల సంఖ్య బాగా పెరిగింది. ఇతర రాష్ట్రాల నుంచి, ఇతర దేశాల నుంచి కూడా వచ్చి పందెం ఇక్కడి



ప్రత్యేక గదిలో గాబుల్లో సేద తీరుతున్న పందెం పుంజులు



కొబ్బరితోటలో కోడి పుంజులు

పందెం పుంజులను కొనుగోలు చేసి తీసుకెళ్లడంతో జిల్లాలో పందెం కోడిపుంజుల పెంపకం గ్రామాలకు వ్యాపించింది. కొందరు యువకులు సువిశాలమైన మైదానాలను, ఖాళీ స్థలాలను లీజుకు తీసుకుని ప్రత్యేక ఏర్పాట్లతో పందెం కోడి పుంజులను పెంచుతున్నారు. ఒక్కో కేంద్రంలో సుమారు 100 నుంచి 200 వరకూ రకరకాల జాతులకు చెందిన పందెం పుంజులను మేపుతున్నారు.

**పందెంపుంజు పెంపకంతో ఆదాయం**

పందెం పుంజులకు ఉన్న గిరాకీని బట్టి నిర్వాహకులకు ఆదాయం కూడా బాగానే ఉంటుంది. మేలు జాతి రకం పెట్టలను పెరూ, ఫిలిఫ్పీన్స్ వంటి దేశాల నుంచి తీసుకువచ్చి మేలుజాతి కోడి పుంజులను ఉత్పత్తి చేస్తున్నారు. కోళ్ల మకాం నిర్వాకుల స్థాయిని బట్టి అర ఎకరం నుంచి ఐదారు ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేస్తున్నారు. ఒక్కో మకాంలో కనీస స్థాయిలో 50 పుంజుల నుంచి 200 పుంజుల వరకూ పెంచుతారు. ఒక్కో పుంజు పందానికి సిద్ధం కావాలంటే 24 నెలల సమయం పడుతుంది. ఒక్కో పుంజును మేపడానికి రూ.15 వేల నుంచి రూ.25 వేల వరకూ ఖర్చు అవుతుందని నిర్వాహకులు తెలిపారు.

**అంతా పోషకాహారమే**

పందెం కోడి పుంజుల పెంపకం అంటే ఆషామాషీ కాదు. నిత్యం వాటిని కంటికి రెప్పలా కాచుకోవాలి. ఒక్కో మకాం దగ్గర కోళ్లపెంపకంలో ఆరితేరిన ఇద్దరు నుంచి పది మందివరకూ నైపుణ్యం కలిగిన పనివారు ఉంటారు. వీరికి జీత భత్యాలు కూడా భారీగానే ఉంటాయి. కోడిపుంజులకు నిత్యం వ్యాయామం చేయిండం, మేత తినిపించడం, ఎండలో తిప్పడం, పందేలకు సిద్ధం చేయడం వంటి పనులతో వాటిని కంటికిరెప్పలా చూసుకుంటారు. ముఖ్యంగా కోడి పుంజులకు ఎలాంటి వ్యాధులు సోకకుండా పలు చర్యలు తీసుకుంటారు. పశువైద్యులను ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకుని ఎప్పటికప్పుడు వాటికి వ్యాక్సిన్లు ఇప్పిస్తారు. కోడిపుంజులకు బలవర్ధకమైన ఆహారం క్రమపద్ధతిలో అందిస్తారు. జీడి పిక్కలు, బాదం, నువ్వులు బెల్లం, వాల్‌నట్స్, పటిక, పుచ్చగింజలు, కిస్మిస్, ఖర్జూరం వంటి డ్రైఫ్రూట్స్, ధాన్యం, రాగులు, సజ్జలు, గంట్లు వంటివి నిర్ణీత సమయాల్లో పెడతారు. ఉడికించిన గుడ్లు, వేట మాంసం కీమా ఉండలు వంటివి అదనం. వీటితో పాటు బలానికి ఖరీదైన మల్టీ విటమిన్లు, లవ్టీటోన్-హెచ్, ఎం-సెఫ్ట్, ఆర్‌డీ, లసోచ్, క్లోన్-30 వంటి టానిక్‌లు, హోమియో మందులు కూడా వినియోగిస్తారు. వీటివల్ల కోడిపుంజులు ఆరోగ్యంగా, బలంగా పెరుగుతాయి.

**జాతిని బట్టి ధర**

మకాంలో పెంచుతున్న కోడిపుంజుల్లో కాకిడేగ, డేగ, కాకిపర్ల, పచ్చకాకి, పెరూ క్రాస్, పెరూకాక్, తెల్ల సవల, నల్ల సవల,సేతువ, కక్కెర, పూల వంటి జాతులు ఉంటాయి. వీటిధర రూ.30 వేల నుంచి రూ.60 వేల వరకూ పలుకుతున్నాయి.

**పుంజు ధర**

**రూ.15 వేల నుంచి రూ.లక్ష**

కోడిపుంజుల ధర ఆయా రకాలు, జాతులను బట్టి ఒక్కో పుంజు ధర రూ.15 వేల నుంచి రూ.లక్ష వరకూ పలుకుతున్నాయి. సంక్రాంతి రోజులు దగ్గర పడేకొలదీ ధరకూడా పెరుగుతుందని నిర్వాహకులు చెబుతున్నారు. తెలంగాణ, కర్నాటక, ఒరిస్సా, చత్తీస్‌గఢ్ తదితర రాష్ట్రాల నుంచే కాక థాయిలాండ్, కాంబోడియా తదితర దేశాల నుంచి కొందరు ఇక్కడి పందెం పుంజులను అధిక ధర చెల్లించి కొనుగోలు చేస్తున్నారు. దీనితో పందెం పుంజులకు అధిక ధర పలుకుతోంది. ఇక బ్రీడ్ కోసం వినియోగించే కోడి ధర 3నుంచి 4 లక్షల వరకూ పలుకుతోంది. నియోజకవర్గంలోని గణపవరం, అర్ధవరం, పిప్పర, కేశవరం, కాశిపాడు, చిలకంపాడు, జల్లికాకినాడ, మొయ్యేరు, పత్తేపురం, నిడమర్రు, తోకలపల్లి, పెద నింద్రకొలను, మందలపర్రు, గుణపర్రు, రాచూరు, నారాయణపురం, చేబ్రోలు, గొల్లగూడెం, భీమడోలు, పూళ్ల, గుండుగొలను, కైకరం తదితర గ్రామాల్లో పందెం పుంజులను పెంచుతున్నారు.

## పేదలకు దుప్పట్ల పంపిణీ



వసంతవాడ శివారు అంబేద్కర్ నగర్‌లో దుప్పట్లు పంపిణీ చేసిన పీ బాల

పెదపాడు : వసంతవాడ గ్రామ శివారు అంబేద్కర్ నగర్‌లో రెవ.ఫాదర్ ఇంజమాల మైఖేల్ ఆధ్వర్యంలో ఆదివారం దివ్య బలిపూజా కార్యక్రమంలో నిర్వహించారు. ఏలూరు పీఠం వికార్ జనరల్ సెంట్ జాన్స్ బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ రెవ.ఫాదర్ పీ బాల ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మైకేల్ తల్లి ఇంజమాల ఫ్రాంచీనమ్మ కూలి పనులు చేసుకుంటూ 10 మంది సంతానాన్ని చదివించి ప్రయోజకులను చేయటమే కాకుండా ఇతరులకు కూడా ఎంతో సాయం అందింది ఆదర్శంగా నిలిచారని బాల చెప్పారు. అనంతరం గ్రామస్తులకు ఫాదర్ మైకేల్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేసి అన్నదానం చేసారు. ఈ కార్యక్రమంలో పెదపాడు విచారణ గురువులు మెలిక్యార్ రాజు, ఫాదర్ యమ్ మరియకుమార్, ఏ తెరేజ్‌బాబు సదరు ట్రస్టు ప్రెసిడెంట్ ఐ రూపేష్, కార్యదర్శులు పాల్గొన్నారు.

**150 మంది వృద్ధులకు దుప్పట్ల పంపిణీ**

భీమడోలు: మాజీ రాష్ట్ర న్యాయ కార్యదర్శి దివంగత వట్టి వీర వెంకట సత్యనారాయణ చేసిన సేవలు మరవలేనివని పలువురు వక్తలు అన్నారు. పూళ్ల పంచాయతీ శివారు ఎంఎంపురంలో ఆదివారం మానవత స్వచ్ఛంద సేవా సంస్థ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు వట్టి సుగుణాకర్ తన తండ్రి వట్టి వీర వెంకట సత్యనారాయణ జ్ఞాపకార్థం సామాజిక సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని 150 మంది నిరుపేద వృద్ధులకు దుప్పట్లు, తుండ్లు, మంకీ క్యాప్‌లు పంపిణీ చేశారు. సమావేశానికి మండల చైర్మన్ గుల్ల నూకరాజు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా శాంతి రథాల కమిటీ అధ్యక్షుడు అప్పక రాంబాబు, మండల కన్వీనర్, రిటైర్డ్ డీఎల్‌పీవో పంచకర్ల సత్యనారాయణ, ఉన్నమట్ల సత్యనారాయణ పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### మంచెం గోపాలకృష్ణయ్య సేవలు ప్రశంసనీయం

భీమడోలు: దివంగత మాజీ సర్పంచ్ మంచెం గోపాలకృష్ణయ్య గ్రామాభివృద్ధికి చేసిన సేవలు ప్రశంసనీయమని పలువురు వక్తలు కొనియాడారు. భీమడోలు మాజీ సర్పంచ్ మంచెం గోపాలకృష్ణయ్య విగ్రహావిష్కరణ ద్వితీయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం సాయంత్రం భీమడోలు పంచాయతీ కార్యాలయంలోని గోపాలకృష్ణయ్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ భీమడోలు సర్పంచ్‌గా 27 ఏళ్ల పాటు మంచెం గోపాలకృష్ణయ్య పని చేసి గ్రామాభివృద్ధికి కృషి చేశారన్నారు. అనంతరం గోపాలకృష్ణయ్య కుటుంబ సభ్యుల ఆర్థిక సాయంతో పంచాయతీ పారిశుద్ధ్య సిబ్బంది, పేదలకు దుప్పట్లను పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో పెద్దలు మంచెం రవీంద్ర, ఈత కోట సుబ్బారావు, మంచెం నాగు, వణుకూరి మురళీ, యడ్ల నాగేశ్వరరావు, కొల్లు సత్యనారాయణ, యర్రంశెట్టి ఏడుకొండలు, కుటుంబ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

### చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పెదవేగి : మద్యం తాగేందుకు డబ్బులు అడిగినా భార్య ఇవ్వలేదని మనస్తాపం చెందిన భర్త పురుగు మందు తాగి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటనపై ఆదివారం కేసు నమోదు చేసినట్లు పెదవేగి ఎస్సై కె రామకృష్ణ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం పెదవేగి మండలం లక్ష్మీపురం పంచాయతీ దిబ్బగూడెం గ్రామానికి చెందిన బడిపాటి రవికుమార్ మద్యానికి బానిసై పని చేయకుండా తిరుగుతున్నాడు. శనివారం భార్య వెంకటేశ్వరమ్మను మద్యం తాగేందుకు డబ్బులు అడిగాడు. ఆమె ఇవ్వకపోవడంతో మనస్థాపం చెందిన రవికుమార్ (46) పురుగు మందు తాగాడు. ఇది గమనించిన ఆమె తన భర్తను ఏలూరులోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం రవి కుమార్ మృతిచెందాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

### రోడ్డు ప్రమాద బాధితురాలికి ఆర్థిక సాయం అందజేత



భీమడోలులో పతివాడ అనసూయకు ఆర్థిక సాయాన్ని అందిస్తున్న దృశ్యం

భీమడోలు: ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడంలో భీమడోలు మానస ఇంగ్లీషు మీడియం పాఠశాల చిన్నారుల చొరవ ఆదర్శనీయంగా నిలిచింది. ప్రిన్సిపల్ యలమర్తి రవీంద్ర కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులు దాచుకున్న రూ.50వేల నగదును రోడ్డు ప్రమాదంలో క్షతగాత్రురాలైన భీమడోలుకు చెందిన పతివాడ అనసూయకు చికిత్స నిమిత్తం అందించారు. అనసూయ తణుకు సమీపంలోని ఓ ఫ్యాక్టరీకి పని నిమిత్తం ఆటోలో వెళ్తుండగా రోడ్డు ప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదంలో ఆమె రెండు కాళ్లు పూర్తిగా దెబ్బతినడంతో మంచానికే పరిమితమైంది. ఆమెకు ఇద్దరు పిల్లలున్నారు. ఆమె ప్రస్తుతం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఆమె కుటుంబ పరిస్థితిని తెలుసుకున్న మానస ప్రిన్సిపల్, చిన్నారులు, ఉపాధ్యాయులు స్పందించి ఆర్థిక సాయం అందించారు. ఆ సొమ్మును భీమడోలులో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీ పుట్టా మహేష్ కుమార్, ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు చేతుల మీదుగా అనసూయకు శనివారం అందించారు. ఈ సందర్భంగా ఏలూరు ఎంపీ స్పందించి తన వంతు సాయంగా రూ.25వేలు, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు రూ.5వేలు, నూతన వస్త్రాలను అనసూయకు అందించారు.

### యల్లా ప్రగడకు భారతరత్న ఇవ్వాలి

గణపవరం: మన జిల్లాకు చెందిన యల్లాప్రగడ చేసిన సేవలకు గుర్తుగా ఆయనకు భారతరత్న ఇవ్వాలని గణపవరం ఏరియా పీఎంపీ అసోసియేషన్ కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానించింది. ఆదివారం ప్రముఖ శాస్త్రవేత్త యల్లాప్రగడ సుబ్బారావు జయంతి సందర్భంగా గణపవరం లయన్స్ క్లబ్ భవనంలో నిర్వహించిన యల్లాప్రగడ జయంతి సభకు పీఎంపీ అధ్యక్షుడు ఎం.సత్యనారాయణమూర్తి అధ్యక్షత వహించారు. తొలుత యల్లాప్రగడ చిత్రపటానికి పూలమాలలు వేసి, జ్యోతి వెలిగించి నివాళులర్పించారు. ఈసభలో పీఎంపీ అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు నిడమర్తి జయసూర్య మాట్లాడుతూ మానవాళి శ్రేయస్సు కోసం జీవితాంతం శ్రమపడి ఎన్నో ప్రాణాంతక వ్యాధులకు మందులు కనుగొని ప్రాణదాతగా నిలిచిన యల్లాప్రగడకు భారతరత్న ఇవ్వడం దేశానికే గర్వకారణమని అన్నారు. జిల్లా పీఎంపీ అధ్యక్షుడు ఏఆర్‌కే పరమేశ్వర్లు, మండల కమిటి సభ్యులు యల్లాప్రగడ సేవలను కొనియాడారు. ప్రముఖ న్యూరాలజిస్టు పి.కృష్ణకిషోర్ న్యూరో సంభంధిత సమస్యలపై అవగాహన సదస్సు నిర్వహించారు. మండల పీఎంపీ అసోసియేషన్ సభ్యులు శివ శ్రీనివాసరావు, వి.అప్పారావు పాల్గొన్నారు.

## ఉత్సాహంగా సంక్రాంతి సంబరాలు



సంప్రదాయ ఎడ్ల బండి



భోగి మంట చుట్టూ నృత్యం చేస్తున్న విద్యార్థులు

దెందులూరు: దెందులూరు బీఆర్‌డీ నర్సింగ్ కళాశాల, డీఈడీ కళాశాల కరస్పాండెంట్ సుగ్గిశెట్టి నూకరాజు ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాతకాలం నాటి వంట సామాగ్రి, పిండి వంటలు, బొమ్మల కొలువు, భోగి పండ్లు పోయడం, పొంగలి తయారీ తదితర కార్యక్రమాలు సందడిగా నిర్వహించారు. సంక్రాంతి పండుగను ఆహ్లాదకర వాతావరణంలో ఎంతో ఉత్సాహంగా నిర్వహించారు. సర్పంచ్ తోట ఏసమ్మ, మొటపర్తి రాజా, రిటైర్డ్ మాస్టర్ ఎం.వెంకట్రాది పాల్గొన్నారు.

**గ్రామాల్లో సందడి**

భీమడోలు: గుండుగొలను, పోలసానిపల్లి, పాతూరులో ఆదివారం నిర్వహించిన రంగవల్లుల పోటీల్లో మహిళలు, యువతులు పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. పాతూరులో ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులులు ముగ్గులను పరిశీలించారు. వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులను అందించారు. గుండుగొలనులో మాజీ ఎంపీపీ శిరిబత్తిన కొండబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులను అందించారు.

## నారాయణపురంలో రక్తదాన శిబిరం



రక్తదాన శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

ఉంగుటూరు: నారాయణపురం గ్రామం గీతాంజలి స్కూలు వద్ద స్వచ్ఛంద రక్తదాన శిబిరం ఆదివారం నిర్వహించారు. జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో ఈ రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఏలూరు వసుందర హస్పిటల్ సౌజన్యంతో ఈ రక్తదాన శిబిరంలో ఏబీవీపీ జిల్లా కన్వీనర్ కె.జితేంద్ర, ముఖ్యఅతిథిగా బళ్ల త్రిమూర్తులు, గీతాంజలి పాఠశాల ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో చిలకంటి జయరాజు, నూకల రోహిత్ నాయుడు, ఎం. శ్రీనివాసరావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## వివేకానంద బోధనలు యువతకు స్ఫూర్తి



భీమడోలులో వివేకానందుని విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సుతాపల్లి ప్రసాద్, మద్దాల అప్పారావు

గణపవరం: భారతదేశ సనాతన ధర్మాన్ని ప్రపంచ దేశాలకు చాటిచెప్పి దేశ ఔన్నత్యాన్ని దశదిశలా వ్యాపింపజేసిన మహనీయుడు స్వామి వివేకానంద యువతకు ఆదర్శప్రాయుడని అఖిల భారత హ్యాండ్లూమ్స్ డైరక్టర్ నంద్యాల రామలింగరాజు అన్నారు. ఆదివారం వివేకానంద 106వ జయంతి సందర్భంగా జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా వివేకానంద సేవాసమితి ఆధ్వర్యంలో అఖిలపక్ష నాయకులు వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వివేకానంద సేవా సమితి అధ్యక్షుడు అల్లూరి గంగరాజు, లయన్స్ క్లబ్ సీనియర్ నాయకుడు కె.నాగేంద్ర ప్రసాద్, సంకు శ్రీనివాసరావు, సీహెచ్ రామకృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

**వివేకనందుని జయంతి**

ఉంగుటూరు: వివేకనందుని జయంతిని ఉంగుటూరు పాఠశాల-1 ఆదివారం నిర్వహించారు. హైస్కూలు కమిటీ మాజీ చైర్మన్ కొరిపల్లి వెంకటఅప్పారావు వివేకనందుని విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

**వివేకానందుని జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయం**

భీమడోలు: స్వామి వివేకానందుని జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని పలువురు వక్తలు అన్నారు. భీమడోలులోని స్వామి వివేకానంద యూత్ అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ నేత సుతాపల్లి ప్రసాద్ ఆధ్వర్యంలో వివేకానందుని జయంతిని పురస్కరించుకుని ఆదివారం జాతీయ యువజన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వివేకానందుని విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. భీమడోలు శాఖా గ్రంథాలయంలో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండే సుధాకర్, ముప్పిరిశెట్టి సుబ్రహ్మణ్యం వివేకానందుడి చిత్రపటానికి మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ గ్రామ పార్టీ అధ్యక్షుడు మద్దాల అప్పారావు, గ్రంథ పాలకుడు కె.శ్రీనివాస్, యువజన సంఘం సభ్యులు, పెద్దలు కిలపర్తి భాస్కరరావు, పున్నం గోపి, విద్యార్థులు పాల్గొన్నారు.

**వివేకానంద జీవితం యువతకు ఆదర్శనీయం**



విజయరాయిలో వివేకానందుని వేషధారణలో విద్యార్థి, నాయకులు

పెదవేగి : యువత స్వామి వివేకానందుని జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని సీఆర్ఆర్ కళాశాల అధ్యాపకుడు చంద్రశేఖర్ పేర్కొన్నారు. పెదవేగి మండలం విజయరాయిలో ఆదివారం జాతీయ యువజన దినోత్సవాన్ని వివేకానంద ఎక్సలెంట్ యూత్ సర్వీసెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొన్నారు. అంతకుముందు విశ్వహిందూ పరిషత్తు, ఆర్ఎస్ఎస్, భాజపా నాయకులు పలువురు స్వామి వివేకానందుని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. యూత్ సర్వీసెస్ అధ్యక్షుడు రాజ రాజశేఖర్, కాగిత శ్రీనివాసరావు, న్యాయవాది బి.రంగారావు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

- ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థుల సందడి
- జోగన్నపాలెం హైస్కూల్లో కలుసుకున్న 1975-76 బ్యాచ్ విద్యార్థులు



గుండుగొలనులోని 1993-94 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు, ఉపాధ్యాయులు



పెదపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఒకే వేదికపైకి 1990-1991 బ్యాచ్ 10వ తరగతి విద్యార్థులు



50 ఏళ్ల తరువాత కలిసి సందడిగా గడిపిన విద్యానిలయం 1975-76 పదవ తరగతి బ్యాచ్ విద్యార్థులు

భీమడోలు: గుండుగొలను మావులేటి సోమరాజు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1993-94 టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. 31 ఏళ్ల క్రితం ఇదే పాఠశాలలో చదువుకున్న 60మంది పూర్వ విద్యార్థులంతా ఒకే చోటకు చేరి సందడి చేసారు. గత మధుర స్మృతులను నెమరు వేసుకుంటూ ఉత్సాహంగా గడిపారు. ఈసందర్భంగా గురువులకు పాదాభివందనం చేసి వారిని దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేసారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఉపాధ్యాయులు మధుసూధనరావు, సోమేశ్వరరావు, ఛాత్రా ది శేష గిరిరావు, సుభాషిణి, పూర్వ విద్యార్థులు నోమి సీతారాం, పాదిలాపు వెంకట్రావు, రాగం నాగేశ్వరరావు, అడగా గణేష్, మొదిన శ్రీనివాసరావు, కె.వంశీ, దాసరి పద్మ, పూడి జ్యోతి, చల్లా సురేష్ పాల్గొన్నారు.

**అలనాటి మధుర స్మృతులతో..**

పెదపాడు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆనందోత్సాహాల మధ్య సందడిగా జరిగింది. వివిధ ప్రదేశాల్లో ఉద్యోగ వ్యాపారాల్లో స్థిరపడిన మిత్రులంతా తిరిగి బాల్యంలో విద్యాబుద్ధులు నేర్చుకున్న పాఠశాలలో కలుసుకుని అలనాటి స్నేహానుభూతులను పంచుకున్నారు. 33 ఏళ్ల తరువాత పాఠశాలకు చెందిన 1990-91 టెన్త్ బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు ఆదివారం కలుసుకుని మధుర స్మృతులను నెమర వేసుకుని సందడి చేశారు. అందరినీ ఒక వేదికపైకి తీసుకురావడంలో కృషి చేసిన స్నేహితులను వారు అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు మోటూరి సీతారాంబ్రహ్మం, మోటూరి లక్ష్మి, కుకునూరి సీతారామకృష్ణారావు, పేర్ల సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

**పోతునూరులో పూర్వ విద్యార్థుల సమ్మేళనం**

దెందులూరు: పోతునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1996-97లో 10వ తరగతి చదువుకున్న విద్యార్థులందరూ ఆదివారం కలిసి ఆత్మీయ సమ్మేళనంలో సందడి చేశారు. పూర్వ హెచ్ఎం గురుమూర్తి, గణిత ఉపాధ్యాయుడు ఎం.సీతారామయ్య, రిటైర్డ్ క్రాఫ్ట్ టీచర్ వేణు అమరేశ్వరరావు, ప్రస్తుత ఇన్‌ఛార్జి హెచ్ఎం వల్లి, పూర్వ విద్యార్థులు సున్నా సుధీర్, జీ.జయరామ్, కే.శ్రీనివాసరావు, ఎస్. బుజ్జిబాబు, డీ.ప్రసాద్, కే.రత్నకుమారి, అగుల్ల నాగేశ్వరరావు, జీ.రామ్‌కుమార్, ఏ.చిన్న, వేణుబాబు పాల్గొన్నారు.

**గుర్తుకొస్తున్నాయి..**

దెందులూరు : చిన్ననాటి స్నేహితుల ఆప్యాయ పలకరింపులు, కల్మషం లేకుండా నిక్‌నేమ్‌లతో పిలుపుతోపాటు బాల్య స్మృతులన్నీ నెమరు వేసుకుని ఆహ్లాదంగా పూర్వ విద్యార్థులందరూ ఆనందంగా గడిపేందుకు దెందులూరు మండలం జోగన్నపాలెంలోని విద్యానిలయం హైస్కూల్ వేదికైంది. పాఠశాలలో 1975-76 పదవ తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆదివారం 50 ఏళ్ల తరువాత చిన్ననాటి స్నేహితులను కలుసుకుని సందడి చేశారు. 24 మంది తమ కుటుంబాలతో ఈ కార్యక్రమానికి తరలివచ్చారు.చింతలపూడి మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీ రామకృష్ణ ఈ బ్యాచ్‌కి చెందినవారు కావడంతో ఆయన హాజరై సందడి చేశా రు. పాఠశాల కరస్పాండెంట్ పి ఇందిరా, కార్య దర్శి మేడికొండ పద్మజ, మరో ఐదుగురు ఉపాధ్యాయులను పూర్వ విద్యార్థులు ఘనంగా సత్కరించారు. ఈ కలయికకు కారకులైన దేవిరెడ్డి సురేంద్రనాథరెడ్డి, ఆలపాటి కిషోర్ బాబు, ఆలపాటి సత్యనారాయణ, మాదల సుబ్బారావు, చెరు కూరి ప్రసాదరావు, ఆలూరి రామకృష్ణ చౌదరి, ఆలపాటి గంగయ్యచౌదరిని పూర్వ విద్యార్థులంతా అభినందించి, కృతజ్ఞతలు తెలియజేశారు.

## సాల్వేషన్ ఆర్మీ చర్చిలో కోత పండుగ

దెందులూరు: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనతో పాటు దానగుణాన్ని కలిగి ఉండాలని సాల్వేషన్ ఆర్మీ డివిజనల్ కమాండర్ జల్లి మోషే అన్నారు. ఆదివారం దెందులూరు సాల్వేషన్ ఆర్మీ చర్చిలో కోత పండగ స్థానిక కోర్ ఆఫీసర్ మేజర్ ఎం. రమణయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. తొలుత ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. డివిజనల్ కమాండర్ జెల్లీ మోషే డీడీ డబ్ల్యూ ఎం.మేరికుమారి లెఫ్టినెంట్ మాణిక్యం, కోర్ ఆఫీసర్ సువర్ణభాయ్ పది మందికి నూతన వస్త్రాలు, దుప్పట్లు పంపిణీ చేశారు. సంఘ పెద్దలు, గృహ సమితి సభ్యులు, సంఘస్తులు, చిన్నారులు పాల్గొన్నారు.

## అచ్చమ్మ పేరంటాల ఉత్సవ పోస్టర్ల ఆవిష్కరణ

పెదవేగి : భక్తుల కోరికలు తీర్చే కొంగుబంగారమైన గాలాయగూడెం అచ్చమ్మపేరంటాల తల్లి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు సిద్ధమయ్యాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అచ్చమ్మపేరంటాలు ఉత్సవ పోస్టర్లను ఆదివారం ఆయన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. తిరునాళ్లకు వచ్చిన భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కమిటీ సభ్యులకు ఎమ్మెల్యే సూచించారు.